


నామినేటెడ్‌పై నజర్

నియామక పదవులపై కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల ఆశలు

- రాష్ట్ర, జిల్లా స్థాయి పోస్టులపై పలువురి దృష్టి
- జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవికి డిమాండ్
- మార్కెట్ చైర్మన్లు, రైతు సమన్వయ సమితుల కోసమూ ప్రయత్నాలు
- నేతల ప్రసన్నానికి ద్వితీయ శ్రేణి కేడర్ ప్రదక్షిణలు
- పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే భర్తీలుంటాయని ప్రచారం



పదేళ్లుగా ఎదురుచూపులే..

కాంగ్రెస్ శ్రేణులకు నామినేటెడ్ పోస్టులను కట్టబెట్టేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆయా జిల్లాల నుంచి అర్హుల జాబితాను తయారు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలోపే ఈ పోస్టులు భర్తీ చేస్తే కేడర్ ఉత్సాహంగా పని చేస్తుందని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, అనసూయ సీతక్కతో ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయమై చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందనే ప్రచారం ఆశావహుల్లో ఉత్కంఠ రేపుతోంది.

వరంగల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రె‌స్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఉత్కంఠ కొనసాగుతోంది. పదేళ్ల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో కీలక పదవులపై నేతలు దృష్టి పెట్టారు. సుదీర్ఘకాలం గా కాంగ్రె‌స్‌లో పని చేస్తున్న నేతలతోపాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పదవులతో సంతృప్తి పరిచేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవులను ఎవరెవరికి ఇవ్వాలో కాంగ్రెస్ అధిష్ఠానం ఓ జాబితాను సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో కీలకమైన పోస్టులను దక్కించుకునేందుకు సీనియర్లు అధిష్ఠానం పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో ఎవరికి ఏ పదవి దక్కుతుందోనన్న చర్చ జరుగుతోంది.

రాష్ట్రస్థాయి పదవులపై ఆశలు

సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్న నేతలకు సముచిత స్థానం కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు వస్తున్న సమాచారంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని నేతలు తమకు రాష్ట్రస్థాయిలో చైర్మన్ పదవులు కావాలని ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాకు చెంది న మాజీ ఎమ్మెల్యే వేంనరేందర్‌రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన సలహాదారుడిగా నియమించడంతో మిగతా నేతలకు కూడా కీలక పదవులపై ఆశలు చిగురిస్తున్నాయి. జనగామ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణలతో పాటు గత ఎన్నికల్లో పరకాల టికెట్ ఆశించిన మాజీ మావోయిస్టు, భూపాలపల్లికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ, ఆత్మకూరుకు చెందిన ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, వర్ధన్నపేట టికెట్ ఆశించిన నమిండ్ల శ్రీనివాస్ తదితరులు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. వీరితోపాటు వరం గల్ ఎంపీ టికెట్ రేసులో ఉన్న మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జంగా రాఘవరెడ్డి కూడా రాష్ట్రస్థాయి పదవుల కోసం పట్టుపడుతున్నారని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 54 నామినేటెడ్ పోస్టులు ఉండగా, ఉమ్మడి వరంగల్ నుంచే అత్యధికంగా పోటీ పడుతుం డటం అధిష్ఠానానికి ఒకింత పరీక్షగా మారిందన్న అభిప్రాయాలున్నాయి. ఈ క్రమంలో ఎవరికి రాష్ట్రస్థాయిలో పదవులు ఇవ్వాలో అనేదానిపై మంత్రులతో చర్చిస్తున్నట్టు తెలుస్తోంది.

జిల్లా చైర్మన్ పదవులు దక్కేదెవ్వరికో?

నామినేటెడ్ పోస్టుల కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి బొద్దిరెడ్డి ప్రకార్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, మీసాల ప్రకాష్, బత్తిని శ్రీనివాస్, ఎండీ అజీజ్‌ఖాన్, అబూబక్కర్, రవళిరెడ్డి, పాల్వాయి శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి తదితరులు పోటీలో ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు మరికొంత మంది సీనియర్ నేతలు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్‌నాగరాజు, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డిపై నామినేటెడ్ పోస్టుల కోసం ఒత్తిడి తీసుకొస్తున్నారు. అలాగే జనగామ జిల్లా నుంచి సుధాకర్, వి.సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ధన్వంతి భర్త లక్ష్మీనారాయణనాయక్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, ఎస్.ప్రవీణ్‌రావు, మహబూబాబాద్ జిల్లా నుంచి బెల్లయ్యనాయక్, భరత్‌చంద్రారెడ్డి, నూనవాత్ రాధ తదితరులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐతే ప్రకాష్, సీసీ డైరెక్టర్ దామోదర్‌గౌడ్, అప్పం కిషన్, రాంనర్సింహరెడ్డి, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, గొల్లపల్లి రాజేందర్ తదితరులు నామినేటెడ్ పోస్టుల రేసులో ఉన్నారు.

ఈ పదవులపైనే నేతల కన్ను

జిల్లా స్థాయిలో నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్న నేతలు కీలక పదవులపై దృష్టిసారించారు. ముఖ్యంగా వరంగల్ నగరంలోని కూడా పోస్టుపై కీలక నేతలు కన్నేశారు. అత్యంత కీలకమైన పదవి కావటంతో కాంగ్రె‌స్‌లోని ముఖ్యనేతలు కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. జంగా రాఘవరెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభార్‌రెడ్డి లాంటి కీలక నేతలు కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఇక వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌పదవిపై కూడా కీలక నేతలు ఆశిస్తున్నారు. అలాగే జిల్లాల్లో అత్యంత కీలకమైన పదవిగా జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ పదవిపై ఎక్కువ మంది ఆశిస్తున్నారు. నెలనెల వేతనంతో పాటు వాహనం అలవెన్స్ కూడా ఇస్తుండటంతో ఎక్కువమంది గ్రంథాలయ చైర్మన్ పదవిపై ఆశతో ఉన్నారు.

అలాగే గత ప్రభుత్వం తీసుకవచ్చిన రైతు సమన్వయ సమితిలపై సందిగ్ధం కొనసాగుతోంది. ఈ పదవులను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ పదవులను కొనసాగిస్తే జిల్లా సమన్వయ సమితి అధ్యక్ష పదవితో పాటు మండల స్థాయిలోనూ కమిటీలతో చాలా మందిని నామినేటెడ్ పోస్టుల్లో భర్తీ చేసే అవకాశం ఉంది. వీటితో పాటు జిల్లా కేంద్రాలతో పాటు ముఖ్యపట్టణాల్లో ఉన్న వ్యవసాయ మార్కెట్లు, దేవాలయాల చైర్మన్ పదవులపై కూడా నేతలు దృష్టి సారించారు. మొత్తానికి పదేళ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీలో నామినేటెడ్ పదవుల జోష్ నెలకొంది.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

పోలింగ్ కేంద్రాల వసతులపై నివేదిక ఇవ్వండి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను అన్ని వసతులతో సిద్ధంగా ఉంచేందుకు సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ కేంద్రాలపై సమగ్ర నివేదిక అందించేందుకు శుక్రవారం జిల్లా అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్‌కేంద్రాలను అధికారులు సందర్శించి, కావాల్సిన వసతులను నివేదికలో పొందుపర్చాలని, ప్రస్తుతం ఉన్న వసతులను నమోదు చేసి, అందజేయాలన్నారు. భయభ్రాంతులకు, ప్రలోభాలకు లోనుకాకుండా శాంతియుత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదుకు కావాల్సిన ఏర్పాట్లను చేపట్టాలన్నారు. ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీపాటిల్ మాట్లాడుతూ అధికారులు సంయుక్తంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ స్టేషన్‌వారీగా నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, మానుకోట, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, జిల్లా అధికారులు సన్యాసయ్య, నర్మద, సూర్యనారాయణ, రామారావు, సుబ్బారావు, మునిసిపల్ కమిషనర్ ప్రసన్నారాణి పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను సక్సెస్ చేయండి

కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుల పిలుపు



మానుకోట మునిసిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇస్తున్న సిబ్బంది

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి2 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతువ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ నడక్‌బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు వంగూరి రాములు, జడ సీతారామయ్య, రేషపల్లి నవీన్, కొత్తపల్లి రవి, మంగలంపల్లి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవనంలో శుక్రవారం కార్మిక సంఘాల ఐక్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వహాయంలో ప్రభుత్వరంగ సంస్థలు పూర్తిగా ప్రైవేట్‌పరం చేశారని, కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చారని విమర్శించారు. కొత్తగా తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లతో కార్మికులు కట్టుబానిసలుగా మారారాని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసి కార్మికుల సత్తాచాటాలని పిలుపునిచ్చారు. రైతు నల్లచట్టాలను తీసుకువచ్చి అన్నదాతలను కూలీలుగా మార్చే చర్యలకు పూనుకుంటుందని విమర్శించారు. ఈ సదస్సులో ఆకుల రాజు, ఎస్కే. మదార్, హెచ్.లింగ్యా కోటేష్, శ్రీనివాస్, శ్రీధర్, ఉపేందర్, నాగన్న పాల్గొన్నారు.

కార్మికులకు రూ.26వేల కనీసవేతనం ఇవ్వాలి..

మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ అనుబంధ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మునిసిపల్ కార్మికులు పాల్గొంటున్నారని మహబూబాబాద్ మునిసిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తూ నాలుగు లేబర్‌కోడ్ రద్దు చేయాలని కోరారు. రామస్వామి, కాగిత శ్రీను, మహేష్, శ్రీను, వెంగల్‌రావు, శ్రీనివాస్, వెంగల్‌రావు, నజీర్, జగన్, మురళి, పుష్పరాజ్ పాల్గొన్నారు.

పగిడిద్దరాజు ఆలయంలో భద్రత ఏర్పాట్లు



పూనుగొండ్ల పగిడిద్దరాజ ఆలయం సందర్శించిన సీఐ ఫణీదర్

గంగారం, ఫిబ్రవరి 2 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా పూనుగొండ్లలో కొలువైన సమ్మక్క పెనిమిటి పగిడిద్దరాజు ఆలయంలో జరిగే జాతరపై భద్రత ఏర్పాట్లను సీఐ ఫణీదర్ శుక్రవారం పరిశీలించారు. జిల్లా సరిహద్దులో దట్టమైన అడవుల నడుమనున్న పగిడిద్దరాజు ఆలయంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో అపర్ణ, తహసీల్దార్ రాము, గంగారం ఎస్‌ఐ దిలీప్, కొత్తగూడ ఎస్‌ఐ నగేష్‌తో కలిసిపూనుగొండ్ల గ్రామంలోని పగిడిద్దరాజు ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో భక్తులకు కావలసిన వసతి, సౌకర్యాలను పరిశీలించారు. మంచినీటి వసతి ఏర్పాటు చే యాలని మండల అధికారులను కోరారు. సమ్మక్క ఆలయానికి భక్తులు వెళ్లే అడవిమార్గంలో వీలున్నంత వరకు తాత్కాలిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. రహదారుల గుంతలు లేకుండా పూడ్చాలని కోరారు. ఆలయ ప్రాంగణంలో భక్త సౌకర్యార్థం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ పూజారి పెనక రాజేశ్వర్, పెనక పురుషోత్తం, సురేందర్ పాల్గొన్నారు.

మేడారంలో ముమ్మరంగా విద్యుత్ పనులు

- జాతరలో కరెంట్ నిరంతర సరఫరాకు ప్రత్యేక చర్యలు
- రూ. 16 కోట్లతో పనులు.. ఇప్పటికే 99 శాతం పూర్తి
- 200 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు.. 425 మంది సిబ్బంది నియామకానికి కసరత్తు
- సీజీఎం, ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మోహన్‌రావు



వివరాలు 7లో..

డోర్నకల్ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హోల్టింగ్ పొడిగింపు

డోర్నకల్, ఫిబ్రవరి 2 : దక్షిణ మధ్యరైల్వే పరిధిలోని లింగంపల్లి నుంచి కాకినాడ, కాకినాడ నుంచి లింగంపల్లి మధ్య నడిచే గౌతమి ఎక్స్‌ప్రెస్‌తో పాటు బీదర్ నుంచి మచిలిపట్నం, మచిలీపట్నం నుంచి బీదర్‌కు నడిచే మచిలిపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లకు డోర్నకల్ రైల్వే స్టేషన్‌లోని హోల్టింగ్‌ను మరో 6 నెలల పాటు పొడిగించినట్లు సంబంధిత ఉన్నతాధికారులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసినట్లు డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు మైనూపాష, ఖాదర్ తెలిపారు. త్వరలో డోర్నకల్ నుంచి భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్ నుంచి డోర్నకల్ ప్యాసింజర్‌ను కూడా పునరుద్ధరించడానికి రైల్వేశాఖ యోచిస్తున్నట్లు వివరించారు. బెలగావి ఎక్స్‌ప్రెస్‌ను భద్రాచలం రోడ్ వరకు పొడిగించేందుకు చొరవ చూపిన మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవితకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

‘ఉపాధి’ పనుల్లో నిధుల గోల్‌మాల్

- గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది కుమ్మక్కు
- 13 పంచాయతీల్లో రూ.2.15లక్షల దుర్వినియోగం
- ప్రజా వేదికలో వివరాలు వెల్లడించిన అధికారులు



మండల ప్రజావేదికలో వివరాలను వెల్లడిస్తున్న ఆడిట్ డీఆర్‌పీ కల్యాణి

నర్సింహులపేట, ఫిబ్రవరి 2 : ఉపాధి హామీ పథకంలో నిధులు గోల్‌మాల్ అయ్యాయి. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది కుమ్మక్కై బినామీ పేర్లపై రూ.లక్షల్లో డబ్బులు స్వాహా చేసినట్లు శుక్రవారం మండల ప్రజాపరిషత్ ఆవరణలో జరిగిన ప్రజావేదికలో సామాజిక తనిఖీ అధికారులు వెల్లడించారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీ పరిధిలో 2021 అక్టోబరు 1వ తేదీ నుంచి 2023 మార్చి 3 వరకు జరిగిన పనులపై 14వ సామాజిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ బృందం వారం రోజులపాటు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, నివేదికను ప్రజావేదికలో వెల్లడించారు. వననర్సరీ, ఎంఐ ట్యాంకులు, మొక్కల పెంపకం, చెరువు పూడికతీత, ఫీడర్ చానల్స్, ఎవెన్యూ ప్లాంటేషన్ వంటి తదితర పనుల్లో ప్రభుత్వ నిధులు అధిక మొత్తంలో దుర్వినియోగమైనట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా మొదటిరోజు జయపురంలో రూ.51, 230, బక్కతండాలో రూ. 16,588, బాసుతండాలో రూ.7,651, కొమ్ములవంచలో రూ. 4,654, రూప్లాతండాలో రూ. 8,879, కౌసల్యదేవిపల్లిలో రూ.2,121, పెద్దనాగారం స్టేజీలో రూ. 4,076, జగ్గుతండాలో రూ.9,139, గోపతండాలో రూ. 6,065, లోక్యతండాలో రూ.7,467, వస్రాంతండాలో రూ.47,570, నర్సింహాపురం బంజరలో రూ. 11,709, బోడ్కాతండాలో రూ.39,938 చొప్పున నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు నిర్ధారించినట్లు అడిషనల్ డీఆర్‌డీవో అధికారి శాంతకుమారి తెలిపారు. నివేదికలతో అవినీతిని బయటకు తీస్తామన్నారు.

మిగిలిన తొమ్మిది గ్రామాలు మరుసటి రోజు పూర్తి, చేసి వివరాలను తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి యాకూబ్, అంబుడ్స్‌మన్ ఆదాం, ఎంపీపీ టేకుల సుశీల, ఎంపీడీవో భారతి, ఎంపీవో సోంలాల్, ఏపీవో భూపాల్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు



ఎస్పీ క్యాంపు కార్యాలయంలో డ్రైవర్లకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్

మహబూబాబాబాద్ రూరల్, ఫిబ్రవరి 1 : ప్రభుత్వ వాహనాన్ని మెయింటెనెన్స్ చేయడంతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లకు ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ప్రశంసాపత్రాలను అందజేశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రశంసా పత్రాలను అందించి, డ్రైవర్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు కేటాయించిన ప్రభుత్వ వాహనాలకు ఏటా.. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఏఆర్ డీఎస్పీ విజయ్‌ప్రతాప్, ఎస్బీ సీఐ బాలాజీ వరప్రసాద్ ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో వాహనాలను తనిఖీ చేసి, రిపోర్టు తీసుకోవడం జరిగిందని చెప్పారు. పోలీస్ అధికారులకు కేటాయించిన వాహనాలు సక్రమంగా మెయింటెనెన్స్ చేస్తూ, వెహికిల్ కండీషన్‌లో ఉండేలా చూసుకుని విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు ప్రశంసాపత్రాలను అందిం చామన్నారు. ప్రతీ సంవత్సరం ఇలాగే ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య, ఎంటీవో సోములు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

- హైదరాబాద్‌లో ఘటన
- మృతుడు గార్ల మండల కేంద్రం వాసి



వల్లభదాసు రాబిన్ (ఫైల్)

గార్ల ఫిబ్రవరి 2 : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గార్ల మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన విద్యార్థి దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం రాత్రి జరుగగా, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరానగర్ కాలనీకి చెందిన వల్లభదాసు రాబిన్ (23) హైదరాబాద్‌లో బీటెక్ చదవుకుంటూ, ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అదే కాలనీకి చెందిన అకారపు హరిచరణ్ పోలీస్ ఉద్యోగం సాధించాలని కోచింగ్ తీసుకుంటూ.. ఓప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వీరు ఇద్దరు కలిసి బాలనగర్‌లో ఓ ఇల్లును అద్దెకు తీసుకొని, నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి ఉద్యోగ పనులు ముగించుకొని, ఇద్దరు ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం అయ్యారు. ఉప్పల్ చౌరస్తా మూలమలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని ఓ కారును ఢీకొట్టడంతో రాబిన్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హరిచరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక పోలీసుల సహకారంతో సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతున్నాడు. హరిచరణ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు తండ్రి కేసముద్రం గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. హరిచరణ్ తండ్రి గార్ల గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు ఉద్యోగిగా విధులను నిర్వర్తిస్తున్నాడు. రాబిన్ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి

డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య

డోర్నకల్, ఫిబ్రవరి 2 : ఉపాధి హామీ పథకంలో కూలీ సంఖ్యను పెంచే విధంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీసన్యాసయ్య సూచించారు. డోర్నకల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ఉపాధిహామీ క్షేత్రస్థాయి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీలో చేపట్టే పనులు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని చెప్పారు. పనులు జరిగేచోట తాగునీటితో పాటు మౌళిక వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చలపతిరావు, ఎంపీవో మున్వర్‌బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటర్ యూనివర్సిటీ జూడో జట్టు ఎంపిక



క్రీడాకారులతో ప్రొఫెసర్ వెంకయ్య

కేయూక్యాంపస్, ఫిబ్రవరి 2: ఈ నెల 5,6 తేదీల్లో పంజాబ్ అమృతసర్ గురు నానక్‌దేవ్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ 2023-24 ఏడాదికి గాను కాకతీయ యూనివర్సిటీ, స్త్రీ, పురుషుల జూడో జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శుక్రవారం తెలిపారు. జట్టుకు హనుమకొండ జాగృతి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ.రాజేశ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఎంపికైన జట్టును కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అభినందించారు.

చిందు కళకు గుర్తింపు తెచ్చిన ఘనత సమ్మయ్యదే..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

దేవరుప్పుల, ఫిబ్రవరి 2: చిందు కళను దేశం గుర్తించే స్థాయికి తీసుకువచ్చిన ఘనత గడ్డం సమ్మయ్యదేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన కళారత్న, హంస అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను శుక్రవారం ఆయన స్వగ్రామమైన దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెలో మంద కృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళను ప్రదర్శించింది చిందు సమాజం అయితే తరతరాలుగా ఆ కళను పోషించింది, గౌరవించింది, కాపాడుకున్నది మాదిగ జాతేనన్నారు. చిందు యక్షగాన కళారూపాలలో సమ్మయ్య కృషి, ప్రతిభను ఆయన ప్రశంసిస్తూ 50ఏళ్ల తపస్సుతో కూడిన తన శ్రమతో, తన కళలతో, నటనతో రంగస్థలపాత్రలతో ప్రజలను అలరించారని కొనియాడారు. సమ్మయ్యకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2కోట్లు ఇవ్వాలని, కళలను బతికించుకునేందుకు ప్రత్యేక భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో చిందు హక్కుల పోరాటసమితి జాతీయ అధ్యక్షుడు గజవెల్లి గణపతి, రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, మాదిగ లాయర్ల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీవీ రత్నం, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, జనగామ జిల్లా అధ్యక్షుడు గజవెల్లి వెంకన్న, చిందు విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి ప్రతాప్, శరత్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ, సైదులు, శ్రీనివాస్, యాదగిరి, రాములు, ఏసుపాదం, సమ్మయ్య కుమారులు గడ్డం సోమరాజు, హిమగిరి పాల్గొన్నారు.



అప్పిరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ, చిత్రంలో యక్షగాన కళాకారుడు సమ్మయ్య, తదితరులు



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వనదేవతలకు నిలువెత్తు మొక్కులు

లక్షకు పైగా తరలివచ్చిన భక్తులు ● సందడిగా మేడారం పరిసరాలు



జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 2: తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ రాష్ట్రాలకు చెందిన లక్షకు పైగా భక్తులు శుక్రవారం మేడారం తరలివచ్చి తల్లుల గద్దెలను దర్శించుకున్నారు. సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెలకు చేరుకొని అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) ఇచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని ఈవో రాజేంద్రం తెలిపారు. కాగా, మేడారం సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకోవడానికి తరలివచ్చే భక్తులు నేరుగా తల్లుల గద్దెలను దర్శించుకోలేక పోయామని అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే తల్లుల కొంగు బంగారం(బెల్లం)గా భావించే ప్రసాదం దొరకడం లేదని అంటున్నారు. తల్లుల గద్దెలకు సమర్పించిన బంగారం ప్రసాదంగా అందాలని భక్తులు కోరుకుంటున్నారు. మేడారం వస్తున్న భక్తులకు తల్లును తాకే అవకాశం లేకుండా గద్దెలకు తాళాలు వేసి దేవాదాయ, పోలీసు శాఖ అధికారుల కుటుంబీకులకు మాత్రం ప్రొటోకాల్ దర్శనాలు కల్పిస్తున్నారని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు



తాటికొండలో పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

హనుమకొండ క్రైం/స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 2: వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు చోట్ల నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో సుమారు రూ.1.27లక్షల మద్యాన్ని పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన మారపాక కరుణాకర్ అనే వ్యక్తి చాలా కాలంగా ఇంటినే అడ్డాగా చేసుకుని బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కరుణాకర్ ఇంటిపై దాడులు నిర్వహించి సుమారు రూ.1.20లక్షల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పట్టుకున్న మద్యాన్ని స్టేషన్ ఘన్‌పూర్ పోలీసులకు అప్పగించారు. అదే విధంగా మడికొండ పోలీసు స్టేషన్ పరిదిలో తరాలపల్లిలో బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. గంగాపురం స్వరూప అనే మహిళ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. సిబ్బంది స్వరూప ఇంటిపై దాడులు నిర్వహించి రూ. 6 వేల విలువ గల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని సంబంధిత పోలీసులకు అప్పగించారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో దరఖాస్తుల సమర్పణ



హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న రామగళ్ల పరమేశ్వర్

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 2: వరంగల్ పార్లమెంట్ టికెట్ ఆశావహులు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తులను సమర్పిస్తున్నారు. గడిచిన రెండు రోజుల్లో కొందరు ఇప్పటికే దరఖాస్తులను అందచేయగా శుక్రవారం మరి కొందరు టికెట్ కోసం అప్లికేషన్‌ను అందచేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్‌తో పాటు ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, విద్యావేత డాక్టరు ఎనెల్లి మురళీదర్శన్ తదితర ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం గడువు ముగియనుండడంతో వరంగల్ పార్లమెంట్ టికెట్ రేసులో ఉన్న నేతలు దరఖాస్తులు అందచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రానున్న మూడు రోజుల్లో స్క్రీనింగ్ ప్రక్రియ కూడా ముగియనుండడంతో ఆశావహులు యత్నాలను ముమ్మరం చేశారు. గాడ్‌ఫాదర్లను ఆశ్రయిస్తూ ఢిల్లీలో మకాం వేస్తున్నారు. ఈ నెల 15 నుంచి 18 లోగానే అభ్యర్థుల ప్రకటన పూర్తి చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉన్నట్లు తెలిసింది. మేడారం జాతరకు ముందే అభ్యర్థులను ఖరారు చేయడం ద్వారా పార్టీకి ప్రయోజనం చేకూరనుందనే అంచనాలు కాంగ్రెస్ నేతల్లో నెలకొన్నాయి.

సీపీని కలిసిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు



సీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 2: వ్యక్తిగత పని నిమిత్తం వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు వచ్చిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. శాంతిభద్రతల పరిరక్షణపై ఇద్దరు అధికారులు కాసేపు మాట్లాడుకున్నారు.

మేడారంలో ముమ్మరంగా విద్యుత్ పనులు

- జాతరలో నిరంతర కరెంట్ సరఫరాకు ప్రత్యేక చర్యలు
- పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న సీఎండీ
- సీజీఎం, ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మోహన్‌రావు వెల్లడి

హనుమకొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరలో టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ పనులను ముమ్మరంగా చేస్తోంది. జాతరకు ఇంకా 20 రోజులు మిగిలుండగానే ఇప్పటికే 99 శాతం పనులు పూర్తయ్యాయని చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్), ఇన్‌చార్జి డైరెక్టర్ కూడా అయిన వి.మోహన్‌రావు వెల్లడించారు. మేడారం జాతరలో నిరంతరం విద్యుత్ సరఫరా ఏర్పాట్లు, విద్యుదాఘాత ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సిబ్బంది నియామకం, గత జాతర కన్నా ఈ సారి అదనంగా చేపడుతున్న పనులు తదితర అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నాలుగు నెలల ముందు నుంచే..

అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడానికి ముందే మేడారం జాతరలో కరెంట్ సరఫరా పనులు మొదలు పెట్టాం. జాతర ప్రాంతంలో పొలాలు ఉండడం, కోతలు పూర్తికాపోవడంవల్ల అక్కడ పనులు చేపట్టడంలో కొంత ఆటంకం ఏర్పడింది. అయినా మొత్తానికి 99 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను వచ్చే పది రోజుల్లో పూర్తి చేస్తాం. జాతర ప్రాంగణంలో ఇప్పటికే విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. గతంలోకన్నా ఈసారి మరిన్ని అదనపు ఏర్పాట్లు చేస్తున్నాం. జాతరలో భక్తులు విడిది చేసే ప్రాంతమంతటా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. ఇప్పుడు అవసరాన్ని బట్టి కొన్నింటిని ఏర్పాటు చేశాం. జాతర సందర్భంగా మిగతా వాటన్నిటినీ ఉపయోగంలోకి తీసుకువస్తాం. దీని వల్ల కరెంట్ నష్టాలు తగ్గుతాయి.

రూ.16కోట్లతో..

జాతరలో రూ.16కోట్ల అంచనా వ్యయంతో కరెంట్ పనులు చేపట్టాం. జాతరలో 160 కేవీఏ, 100 కెవీఏ తదితర ట్రాన్స్‌ఫార్మర్లు సుమారు 200 వరకు ఏర్పాటు చేశాం. జాతరలో రెండు సబ్‌స్టేషన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అంతకుముందు తాడ్వాయి నుంచి చిన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంట్‌ను తీసుకోవలసి వచ్చేంది. 2013లో కొత్తూరులో ఒకటి, ఆ తర్వాత మ్యూజియం దగ్గర మరోసబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశాం. ఇక్కడి నుంచి నాలుగు ఫీడర్లు వెళుతున్నాయి. వీటిలో ఒక ఫీడర్ ప్రత్యేకంగా అమ్మవారి గద్దెల వరకు వెళుతుంది. ఈ రెండు సబ్‌స్టేషన్ల నుంచి రెండు లైన్లు వేసాము. దీనితో కరెంట్ సరఫరాలో అంతరాయం కలగడం అనేది ఉండదు.

భక్తులు విడిది చేసే ప్రాంతమంతా..

గతంలోకన్నా ఇప్పుడు భక్తులరాక గణనీయంగా పెరిగింది. దీనితో జాతర విస్తీర్ణం కూడా పెరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని జాతరలో భక్తులు విడిది చేసే ప్రాంతమంతటా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. భక్తులు విడిది చేయడం కన్నెపల్లి నుంచి మొదలై అమ్మవారు బయలుదేరు చిలకలగుట్ట ఆ చుట్టుపక్కల ప్రాంతాల వరకు ఉంటుంది. ఈ మొత్తం ప్రాంతానికి కరెంట్ సరఫరా ఉండేలా లైన్లు వేశాం. ప్రధానంగా గద్దెల నుంచి అరకిలోమీటర్ వరకు పటిష్టమైన విద్యుత్ సరపరా వ్యవస్థ ఎప్పటికీ అందుబాటులో ఉంటుంది.



జాతర ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం



సీజీఎం మోహన్‌రావు

ఆర్టీసీవారికి..

జాతరలో ఆర్టీసీకి సంబంధించి ఈ సారి కొన్ని అదనపు పనులను కూడా చేపట్టాం. ఆర్టీసీ గట్టమ్మవద్ద రెండు పార్కింగ్ స్థలాలను, అలాగే తాడ్వాయి వద్ద మరో హోల్డింగ్‌ను అదనంగా ఏర్పాటు చేస్తోంది. అక్కడ అవసరమైన విద్యుత్ సరఫరా ఏర్పాటు చేస్తున్నాం. గద్దెల తర్వాత భక్తుల రద్దీ ఎక్కువ ఉండేది జాతరలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ల వద్దనే. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీవారి సూచనల మేరకు విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేశాం. సరఫరాలో అంతరాయం కలుగకుండా ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. సరఫరాలో అంతరాయం ఏర్పడినపుడు వెంటనే సరిచేయడానికి ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒక ఉద్యోగి ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. ఏ చిన్న సమస్య వచ్చిన సమాచారం అందగానే అవసరమైతే మరికొంత సిబ్బంది కూడా అక్కడికి వెళ్లి తక్షణం పరిష్కరించేలా ఏర్పాట్లు చేశాము.

425 మంది సిబ్బంది

నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయడమే కాకుండా మరింత మెరుగ్గా ఇచ్చేందుకు జాతరలో 425 మంది సిబ్బందిని నియమిస్తున్నాం. ఒక డైరెక్టర్ స్థాయి అధికారితో పాటు ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు, ఏడుగురు డీఈలు, 15మంది అదనపు ఏడీలు, ఏఈలు, లైన్లుమన్లు ఓ అండ్‌ఎం స్టాఫ్ వీరిలో ఉన్నారు. వీరంతా జాతర జరిగే నాలుగు రోజులు రాత్రింబవళ్లు విధుల్లో ఉంటారు. వీరితోపాటు ఎక్కడైనా పోల్ విరిగినా, లైన్లలో అంతరాయం కలిగినా తన కూలీలతో ఆ పనులు పూర్తి చేయడానికి సంబంధిత కాంట్రాక్టర్‌ను కూడా అందుబాటులో ఉంచుతున్నాం.

అంతరాయం కలుగకుండా...

జాతరలో చిరువ్యాపారులు తీగలపై వైర్లు వేసి అక్రమంగా కరెంట్ వాడుకోవడం తరుచూ జరుగుతుంటుంది. దీని వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడు పడి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ఈ సారి అధునాతన సాంకేతికను వాడుతున్నాం. దీనికోసం ఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఎక్కడైనా తీగలపై వైర్లు వేసినా ఆ విషయం క్షణాల్లో జాతరలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలుస్తుంది. సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేసి దానిని నివారిస్తాం.

ప్రమాదాల నివారణకు..

జాతరలో ఇసుకవేస్తే రాలనంత జనం ఉంటారు. ఒత్తిడి తీవ్రంగా ఉంటుంది. ఈ క్రమంలో పోల్స్ దెబ్బ తినో, మరేదైనా కారణంవల్ల కరెంట్ వైర్లు తెగి భక్తులపై పడకుండా నివారించేందుకు ప్రతీ మూడు మీటర్లకు ఒక ప్లాస్టిక్ ఫేసర్‌ను వైర్లపై ఏర్పాటు చేస్తున్నాం. వైర్లు సుమారు 17 మీటర్ల ఎత్తులో ఉంటాయి. ప్రమాదవశాత్తు ఎక్కడైనా వైర్ తెగినా అది భక్తులకు తగలనంత ఎత్తులోనే వేలాడుతుంటాయి. దీనివల్ల భక్తులు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉండదు.

సిబ్బందికి వసతి

జాతరలో పనిచేసే విద్యుత్ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒకటి చొప్పున 40వరకు టెంట్లు వేస్తున్నాం. ఒక్కో టెంట్‌లో ఐదుగురికి వసతి ఉంటుంది. వీరు విధి నిర్వహణ అనంతరం ఇందులో విశ్రాంతి తీసుకోవచ్చు. అంతేకాకుండా సిబ్బందికి భోజన వసతి కోసం జాతరలోని రెండు సబ్‌స్టేషన్ల వద్ద ఫుడ్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నాం.

సీఎండీ ప్రత్యక్ష పర్యవేక్షణ

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మేడారం జాతరలో కరెంట్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తు న్నారు. కరెంట్ సరఫరా ఏర్పాట్లు సకాలంలో పూర్తయ్యేలా మార్గదర్శనం చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు మేడారం సందర్శించి పనుల పరోగతిని సమీక్షించారు. ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశాలు నిర్వహించి పనుల ప్రగతిని అడిగి తెలుసుకుంటున్నారు. గత జాతర కన్నా ఈసారి విద్యుత్ సరఫరా ఏర్పాట్లు మరింత మెరుగ్గా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి కొంత మేరకు నిధులు అందాయి. మిగతా వాటిని ఎన్‌పీడీసీఎల్ సంస్థ భరిస్తోంది. జాతరలో దుకాణాలకు కరెంట్ సరఫరా చేయడం వల్ల వచ్చే ఆదాయం ఏమంత ఎక్కువగా ఉండదు. అయినా కూడా భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత మేరకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నాం.



విద్యుత్ స్తంభానికి వైరు సరిచేస్తున్న సిబ్బంది

ఎన్నికల వేళ.. 'ఉక్కు'వేడి

- మళ్లీ తెరపైకి బయ్యారం పరిశ్రమ అంశం
- చివరి బడ్జెట్‌లోనూ ఊసెత్తని కేంద్రం
- పదేళ్లుగా మీనమేషాలు లెక్కించిన బీఆర్ఎస్
- కాంగ్రెస్‌పైనే నిరుద్యోగుల ఆశలు

మహబూబాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అపార ఖనిజ సంపదతో విరాజిల్లుతున్న మానుకోట ప్రాంతం ఎందుకు వెనుకబడింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక యువత దేనికి విలవిల్లాడుతోంది? ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమం వెనుక నీళ్ల, నిధులు, నియామకాలు కీలకం ఎందుకయ్యాయి. మడిమ తిప్పని మలిదశ ఉద్యమ పోరాట ఫలితంగా కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఇవ్వడం.. సాధన ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ పదేళ్ల పాలించడం.. ఇవన్నీ వరుసగా జరిగిన పరిణామాలు..! తాజాగా గురువారం ప్రవేశపెట్టిన చివరి పార్లమెంట్ బడ్జెట్‌లోనూ తెలంగాణ ఉక్కు ఊసేలేకుండా పోయింది. దీనికి ముందే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే విభజన చట్టంలోని హామీలు నేరవేర్చుకోగలమని ఇటీవలనే సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో తెలంగాణ ఉక్కు అంశాన్ని కాంగ్రెస్ రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానాస్త్రంగా సంధించబోతుందన్న సంకేతాలు కన్పిస్తున్నాయి. ఉక్కు పరిశ్రమ నినాదం ప్రతీ ఎన్నికల్లో ఓట్లను కొల్లగొట్టే హామీగానే మిగిలిపోతూ వస్తున్న క్రమంలో ఈ పార్లమెంట్ ఎన్నికల పోరులో బయ్యారం ఉక్కు వేడి మరింత రాజుకోబోతోంది. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర అధికారంలో ఉన్న దరిమిలా విభజన చట్టంలోని ఉక్కు పరిశ్రమ హామీ ఇకనైనా అమలురూపం దాల్చేలా కార్యాచరణ చేపట్టే బాధ్యత తీసుకుంటుందని యువత ఆశిస్తోంది.


ఉక్కు వెనక నడిచిన తతంగమిదీ..

రాష్ట్ర పునర్విభజన చట్టంలోని తెలంగాణ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు రెండుసార్లు జరిగిన పార్లమెంట్ ఎన్నికల నెరవేరని వాగ్దానాలుగానే మిగిలిపోయాయి. సుదీర్ఘకాలంగా సర్వేలపై సర్వేలతో పదేళ్ల పాటు నానుస్తూ వచ్చిన కేంద్రంలోని బీజేపీ, కేంద్రం కాదంటే సింగరేణి ద్వారానైనా పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న పూర్వ తెలంగాణ ప్రభుత్వ ప్రకటనలు ఎన్నికల హామీలుగానే మిగిలిపోయాయి. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన ఏకైక ఉక్కుపరిశ్రమ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరుగున పడేశాయి. బయ్యారం ఇనుప ఖనిజం నిక్షేపాల వెలికితీతకు ఆరు దశాబ్దాల కిందటి చరిత్ర ఉంది. 1952లో తొలిసారిగా బయ్యారంలో మినీ ఉక్కుకర్మాగారం ఏర్పాటు చేసి కొంతకాలం పాటు ఇనుప ఖనిజాన్ని వెలికితీశారు. అలా వెలికితీసిన ఖనిజాన్ని ఇతర రాష్ట్రాలతో పాటు జపాన్‌కు ఎగుమతి చేసేవారు. తర్వాత ఏ కారణం చేతనో కానీ ఇనుప ఖనిజం వెలికితీత పనులు నిలిచిపోయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వ హయంలో 2004 నుంచి 2009వరకు 5ఏళ్ల పాటు ఖనిజాన్ని మళ్లీ వెలికిసి, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బయ్యారం ఉక్కు అంశం కీలకంగా మారడంతో అప్పటి యూపీఏ ప్రభుత్వం రాష్ట్రం విభజన చట్టంలో ఖమ్మం జిల్లాలో స్టీల్ పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని జోడించింది. ఆ దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పలుమార్లు సర్వేలు జరిపారు. పలు సంస్థలు చేపట్టిన సర్వేల్లో కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగానే సానుకూలత రిపోర్టు వచ్చినట్లు ప్రకటనలు ఊరించాయి.

బీఆర్ఎస్ అలాగో.. ఇలాగో.. చేస్తానని..

స్వరాష్ట్ర ఆవిర్భావం నుంచి ఉక్కుఫ్యాక్టరీపై నానుస్తూ వచ్చినా కేంద్రం కుదరదని సుప్రీంకోర్టులో తేల్చిచెప్పడంతో గత సర్కార్ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులు కేంద్రం ఒప్పుకున్నా లేకున్నా ఎట్టి పరిస్థితుల్లో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి తీరుతామంటూ ప్రకటనలు చేశారు. సింగరేణి సంస్థతో పాటు టీఎస్‌ఎండీసీతో ఖనిజ నాణ్యత, పరిమాణంపై సర్వేలు కూడా చేయించారు. ఇక్కడ సరిపడ ఖనిజం లేకపోయినా పక్క రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ బైలడిల్లా నుంచైనా సరే ముడి సరుకును దిగుమతి చేసుకొని బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి తీరుతామని హామీలు గుప్పించారు. ఒకానొక సందర్భంలో హైదరాబాద్ వచ్చిన కేంద్రమంత్రి బీరేందర్ సింగ్ కూడా తెలంగాణ వాదులకు తీపి కబురంటూ ఖమ్మం జిల్లా స్టీల్ ఫ్యాక్టరీపై ప్రకటనలు చేశారు. అంతా ఉత్తుత్తే అయిపోయింది. సుమారు 300 మిలియన్ మెట్రిక్ టన్నుల అపార ఇనుప ఖనిజ నిక్షేపాలు బయ్యారంలో ఉన్నాయన్న జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలు ఒకవైపు ఉన్నప్పటికీ కేంద్రం నాణ్యమైన ఐరన్‌ఓర్ బయ్యారంలో లేదని చెప్పడంతో ఉక్కు సంకల్పం ఉట్టికెక్కింది.





రాజుకుంటున్న ఉక్కు నినాదం..

స్వరాష్ట్రంలో మూడోసారి పార్లమెంట్ ఎన్నికల వేడిలో 'ఉక్కు పరిశ్రమ' హామీ రాజుకుంటోంది. కేంద్రంలోని బీజేపీ రెండుదఫాలు బయ్యారం ఉక్కుపై ఎటు తేల్చకుండానే పక్కన పెట్టేసింది. రాష్ట్రంలో సైతం ఉద్యమ ఆకాంక్షతో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ కూడా దాటవేత ధోరణిలో అంకితభావాన్ని విస్మరించింది. నాడు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఇందులో తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాం కూడా భాగస్వామ్యం వహించడం దాదాపు ఖరారైన క్రమంలో నిరుద్యోగ యువతలో ఉక్కు పరిశ్రమపై ఆశలు చిగురిస్తున్నాయి.

తాజాగా ఖైరతాబాద్ ప్రాంతంలో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో 'విభజన హామీలు, కేంద్ర ప్రభుత్వం వివక్ష' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించడం, అందులో ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీతో పాటు బయ్యారం ఉక్కు పరిశ్రమ అంశాలు చేర్చడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. స్వయంగా ప్రొఫెసర్ కోదండరామ్ ఈ అంశాలపై ప్రసంగాలు చేస్తూ పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ.. విభజన చట్టం హామీల అమలు ఆవశ్యకతను గుర్తు చేయడంతో కాంగ్రెస్ హయంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు దిశగా అడుగులు పడతాయన్న భావన తెలంగాణ సమాజంలో వస్తోంది. ప్రభుత్వం చేపట్టిన వందరోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు కోసం కసరత్తుల్లో నిమగ్నమైన కాంగ్రెస్ ఆపై ఉక్కుపరిశ్రమ తుట్టెను కదిలిస్తుందని ఆశిస్తున్నారు. పార్లమెంట్ చివరి బడ్జెట్ సమావేశాల్లోనూ బీజేపీ ఉక్కుఊసే ఎత్తకపోవడంతో ఇక ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్‌కు ఇది రేపటి ఎన్నికల నినాద ఆయుధంగా మారుతుందనడంలో అతిశయోక్తి లేదు.

రేపు రిటైర్డ్ సీబీఐ డైరెక్టర్ ప్రసంగ కార్యక్రమం

హనుమకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రైమరీస్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు 'భారత రా జ్యాంగం - సాంస్కృతిక వికాసం - పరిపాలన ధోరణులు' అనే అంశంపై రిటైర్డ్ సీబీఐ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర రావు ప్రసంగం ఉంది. శ్రీ శారదాక్రిష్ణ సాహితీ సామాజిక సాంకేతిక ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ట్రస్ట్ ఛైర్మన్ కాసర్ల రంగారావు అధ్యక్షత వహిస్తారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఎన్ చారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలకుర్తి దినకర్, కవి, రచయిత డాక్టర్ పల్లేరు వీరస్వామి, అరవింద ఆశ్రమం కార్యదర్శి వరిగొండ కాంతారావు ముఖ్య అతిధులుగా, కవి పండితులు గిరిజా మనోహర్ బాబు విశిష్ట అతిథిగా పాల్గొంటారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు రేపు

హనుమకొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి2: వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్స్ బాల బాలికల విభాగంలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 9నుంచి 11వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాల బాలికలు ఈ నెల 4న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టులో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని వీరన్న సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 9849201467 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 2: హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి రమేష్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోని కేయూ జంక్షన్, గొల్లపల్లి, పెద్దమ్మగడ్డ, గోపాలపురం జంక్షన్‌లలో గురువారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 18 మందిని అదుపుతోకి తీసుకుని పరీక్షలు నిరహించగా, మద్యం సేవించినట్లు తెలిసింది. వీరిని శుక్రవారంకోర్టుకు తరలించగా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన ఎమ్డీ నజీర్, రేగొండ మండలం రాయపల్లికి చెందిన లెదెల్ల శ్రావన్‌కుమార్‌లకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మిగతా 16 మందికి జరిమానా విధించారు.

వ్యక్తి మృతికి కారణమైన ముగ్గురికి ఐదేళ్ల జైలు, జరిమానా

- మరో ఇద్దరికి రూ.4వేల జరిమానా
- తీర్పు వెలువరించిన ప్రధాన అసిస్టెంట్ జడ్జి

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 2: వైవాహిక జీవితంలో జరిగిన గొడవల నేపథ్యంలో అత్తింటి వారు వేధించడం వలన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతికి కారకులైన భార్య కృష్ణవేణి, బావమరిది సురేష్, అత్త కనకతారలకు ఒక్కొక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ ప్రధాన అసిస్టెంట్ జడ్జి బ్యంగి శ్రీనివాసులు తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరునెలలు జైలు శిక్ష అనుభవించాల్సిందిగా తీర్పులో పేర్కొన్నారు. అదే విధంగా దాడికి పాల్పడిన మరో ఇద్దరు నిందితులు నాగరాజు, భార్య మేనమామ రాజశేఖర్ ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే నాలుగు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సిందిగా న్యాయ మూర్తి తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

దర్గాకు చెందిన బాసబత్తిని సురేష్‌కు వరంగల్ కాశిబుగ్గ నివాసురాలైన గోరంట్ల కృష్ణవేణితో 2016 ఏప్రిల్ 20న వివాహం జరిగింది. పెళ్లైన తర్వాత వీరిమధ్య గొడవలు మొదలై ఆరునెళ్ల తర్వాత పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రతీసారి పంచాయితీ నిర్వహించి సురేష్‌తో క్షమాపణ చెప్పించేవారు. తరచూ ఇంట్లో నుంచి గొడవపడి వెళ్లిపోయేది. పెళ్లైన తొమ్మిది నెలల తర్వాత నిందితులు బావమరిది గోరంట్ల సురేష్, అత్త కనకతార, చాలాసార్లు సురేష్‌పై కుటుంబసభ్యులతో కలిసి దాడి చేశారు. ఈ క్రమంలో 2019 జనవరి 25న ఉదయం 7గంటలకు దర్గాలో ఒంటరిగా ఉంటున్న సురేష్‌పై బావమరిది సురేష్, మిత్రులు, అతడి కుటుంబసభ్యులు ఒక కారు, ఆటోలో ఇంటికి వెళ్లి విపరీతంగా కొట్టారు. ముక్కు, చెవుల నుంచి రక్తం వచ్చేలా తీవ్రంగా గాయపరిచారు. మళ్లీ ఆటోలో ఎక్కించుకొని కాశిబుగ్గ వరంగల్‌కు కొట్టుకుంటూ తీసుకెళ్లి వదిలేశారు. దీంతో సురేష్ అవమానాన్ని భరించలేక ఎవరికీ చెప్పులేక కుమిలిపోయాడు. అనంతరం అత్తింటివారు 2019 ఫిబ్రవరి 1న సురేష్, అతడి తల్లిపై మహిళా పోలీసుస్టేషన్‌లో వరకట్నం కేసు నమోదు చేయించారు.

ఈవిషయాలపై బాసబత్తిని సురేష్ మానసిక క్షోభకు గురై మనోవేదనతో 2019 ఫిబ్రవరి 5న సూసైడ్‌నోట్ రాసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్‌నోట్‌లో తన చావుకు భార్య, ఆమె తరపు బంధువులు కారణమని పేర్కొన్నారు. కాగా, సురేష్ భార్య గోరంట్ల కృష్ణవేణి, బావమరిది గోరంట్ల సురేష్, అత్త కనకతార, సురేష్ మేనమామ కోట రాజ్‌కుమార్, అతడి స్నేహితుడు వేముల నాగరాజుపై చట్టరిత్యా చర్య తీసుకోవాలని మృతుడి అక్క బాసబత్తిని సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున ఐదుగురి నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ. సుధాకర్ సాక్షులను ప్రవేశపెట్టగా, దర్యాప్తు అధికారులుగా ఎస్సైలు డి. దేవేందర్, సర్దార్ రాజు వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ. భద్రాద్రి కేసు వాదించారు.

ఇక.. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు

- పల్లె, బస్తీ దవాఖానాలు, హెల్త్ సెంటర్‌ల పేరు మార్పు
- కేంద్రప్రభుత్వ ఆదేశాలతో అధికారుల చర్యలు

తొర్రూరు, ఫిబ్రవరి 1 : గ్రామీణ పల్లెప్రాంతాల్లో వైద్యసేవలు అందించే ఆరోగ్య కేంద్రాలన్నీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా మారనున్నాయి. ఇందుకు 'ఆరోగ్య పరమం ధనం' అనే నినాదంతో కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాలోని ఏరియా ఆస్పత్రి, 2 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు, 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 174 సబ్ సెంటర్‌లు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా పేరు మార్పు చేస్తున్నారు. ఈ ప్రక్రియను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. గత రెండురోజుల క్రితం వచ్చిన ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని సబ్‌సెంటర్‌లకు పేరుమార్పులు చేస్తున్నారు. దాదాపు ఇప్పటి వరకు అన్నికేంద్రాలకు పేరు మార్చేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటి వరకు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలుగా ఉన్న వాటిని హెల్త్‌అండ్‌వెల్‌నెస్ సెంటర్‌లుగా పిలుస్తున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలుగా పేరు మార్చింది. నిజానికి వాటన్నింటికీ కేంద్రప్రభుత్వమే నిధులు ఇస్తోంది. ఐతే వాటిని రాష్ట్రప్రభుత్వమే ఏర్పాటు చేసినట్లుగా ప్రచారం చేసుకుంది. ఆ కేంద్రాలకు ఆయుష్మాన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలుగా పేరు మార్చాలని గతంలో కేంద్ర వైద్య శాఖ ఆదేశాలు ఇచ్చింది. పేరు మార్పిడి చేస్తేనే నిధులు ఇస్తామని స్పష్టం చేసింది.

ఆయుష్మాన్ కేంద్రాలకు ఎన్‌హెచ్ఎం నిధులు

రాష్ట్రంలో కొనసాగుతున్న పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలకు కేంద్రం జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా నిధులు అందిస్తుంది. రాష్ట్రప్రభుత్వం పల్లె దవాఖానాలుగా పేరు మార్చడంతో నిధులు నిలిపివేసింది. వెంటనే గత ప్రభుత్వం వాటిని ఆయుష్మాన్ భారత్ కేంద్రాలుగా మార్చడంతో నిధులను విడుదల చేసింది.


ఆరోగ్య మందిర్‌గా పేరు మారిన పల్లె దవాఖాన

ప్రత్యేక నిధులు..

కేంద్రప్రభుత్వం గతంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాలను ఆయుష్మాన్ భారత్ పేరు మార్పిడి చేపట్టేందుకు ఒక్కో సెంటర్‌కు రూ. 3వేలు నిధులు కేటాయించింది. వాటితో అధికారులు కేంద్రప్రభుత్వ లోగోలు, సబ్ సెంటర్ పేరు ప్రజలకు సులభంగా తెలిసేందుకు ప్రత్యేక లోగోలు వేయించారు. కానీ, కేంద్రప్రభుత్వం ఇటీవల ఆయుష్మాన్ భారత్ కేంద్రాలన్నింటినీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా పేరు మార్చాలని జీవో జారీ చేయడంతో పాటు తిరిగి మరల నిధులు కేటాయించింది.

కాగా, అధికారులు ఇదే అదనుగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంగా పేరుమార్చి, చేతులు దులుపుకుంటున్నారు. కేంద్రప్రభుత్వం కేటాయించిన నిధులు పక్కదారి పడుతున్నాయి. అధికారులు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేద ప్రజల ఆరోగ్యం కోసం కేంద్రప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అన్నిరకాల వైద్యసేవలు అందించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ, అధికారుల అనాలోచిత నిర్ణయాలతో నిధులు పక్కదారి పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మరో రెండుమూడు రోజుల్లో ఆయుష్మాన్ భారత్ కేంద్రాలను ఆరోగ్య మందిరాలుగా పేరు మార్చి ఫొటోలను కేంద్ర మంత్రిత్వశాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి2 : నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటు నమోదు చేసుకోవాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్-తెలంగాణ స్టేట్ (పీఆర్టీయూ-టీఎస్) జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ కోరారు. మహబూబాబాద్ కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఫాం-18ను పూర్తి చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు ఈనెల 6వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. నాయకులు కళ్లెం వెంకట్‌రెడ్డి, భూక్య రామోజీనాయక్, ఉమాదేవి, ప్రవీణ్‌కుమార్, వెంకన్న, కోట్యానాయక్ పాల్గొన్నారు.

'ఎంపీ టికెట్ లక్ష్మీనారాయణకు ఇవ్వాలి'

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 2 : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లకావత్ లక్ష్మీనారాయణ నాయక్‌కు మానుకోట పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని విద్యార్థి జేఏసీ చైర్మన్ గోపినాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్లంపేట శివారు సోమ్లా తండాలో ఆయన మాట్లాడారు. 1999 నుంచి కాంగ్రెస్ పార్టీలో లక్ష్మీనారాయణనాయక్ పని చేస్తున్నారన్నారు. 2006లో డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్ సతీమణి ధన్వంతికి ఉమ్మడి వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా నియమించారన్నారు. మానుకోట ఎంపీ టికెట్‌ను లక్ష్మీనారాయణకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, లక్ష్మణ్, వికాస్, శ్రీనివాస్, రవీందర్, సురేష్ పాల్గొన్నారు.

పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 2 : బడీడు పిల్లలతో పనిచేయిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీపాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జనవరిలో జిల్లా వ్యాప్తంగా ఏఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నపిల్లలతో పనులు చేయిస్తున్న 38 మంది యాజమానులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. బలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు రాష్ట్ర పోలీస్ శాఖ వివిధ శాఖల సహకారంతో ఏటా రెండుసార్లు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జనవరిలో ఒకసారి, జూలై నెలలో మరోసారి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా 58 మంది బాలకార్మికులకు పనుల నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. అందులో 12 మంది బాలికలు ఉండగా 46 మంది బాలురు ఉన్నట్లు చెప్పారు. వారిని సీడబ్ల్యూసీ చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి అప్పగించడం జరిగిందన్నారు. 5 నుంచి 14 ఏళ్లలోపు ఉన్న పిల్లలను బాలకార్మికులుగా పరిగణిస్తారని, వారిని ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసులు నమోదు చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్ఎస్సై సునంద, ఎస్సై మౌలానాకు ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే డయల్ 100కు, లేదా 1098 చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.


మానుకోట ఎంపీ సీటు కోసం దరఖాస్తు చేసుకున్న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ భట్టు రమేష్

కాంగ్రెస్ ఎంపీ సీటు కోసం.. పలువురు దరఖాస్తులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి2 : మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గం గిరిజన రిజర్వ్‌డ్ (ఎస్టీ) స్థానానికి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కోసం కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్, ప్రొఫెసర్ భట్టు రమేష్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 ఎంపీ స్థానాలకు గాంధీభవన్‌లో అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అందులో భాగంగా గతంలో మహబూబాబాద్ ఎంపీగా 2009లో గెలిచి 2014 వరకు కేంద్రమంత్రిగా పని చేసిన పోరిక బలరాంనాయక్ తరపున ఆయన కుమారుడు కిరణ్‌సాయి గాంధీభవన్‌లో దరఖాస్తు చేశారు. ప్రస్తుతం బలరాంనాయక్ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. 2023లో రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి విశేష కృషి చేశారు. మరోపక్క పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్‌నాయక్ గాంధీభవన్‌కు వెళ్లి ఎంపీ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన 2009 ఎన్నికల సమయంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడిగా పని చేశారు. 2003లో మాజీ సీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి నిర్వహించిన మహాప్రస్థానం పాదయాత్రలో పాల్గొన్నారు. 1997లో భద్రాచలం అసెంబ్లీ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2019లో మానుకోట ఎంపీ స్థానం కోసం దరఖాస్తు చేసుకున్నారు. మహిళ కాంగ్రెస్ మానుకోట జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ ఎంపీ స్థానం కోసం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆమె జడ్పీటీసీగా పోటీచేసి, ఓడిపోయారు. అలాగే ఎట్టి వెంకన్న కూడా పార్లమెంట్ బరిలో నిలువడానికి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు.

ప్రతీ అసెంబ్లీ ఎన్నికల్లో మానుకోట సెగ్మెంట్ సీటును ఆశిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం మహబూబాబాద్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

మా భూముల్లో గురుకులం నిర్మించవద్దు

గూడూరు, ఫిబ్రవరి 2 : మా భూముల్లో ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల భవన నిర్మాణం చేపట్టవద్దని సంబంధిత గిరిజన రైతులు భూక్య రాములు, భూక్య లక్ష్మి, భూక్య శ్రీను, భూక్య శ్రావణ్, భూక్య దేవమ్మ, బానోత్ లాలు, బానోత్ వాల్య, బానోత్ బాలులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులకు సంబంధించిన 8.20 ఎకరాల భూమిలో గత సంవత్సరం అక్టోబర్ 9న అప్పటి రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖమంత్రి సత్యవతి రాథోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనుల కోసం రూ.35 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. గ్లోబల్ ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ టెండర్‌ను కైవసం చేసుకుని పనులు ప్రారంభించింది. ఇందులో భాగంగా శుక్రవారం భూమిని చదును చేస్తుండగా సంబంధిత రైతులు పనులను అడ్డుకున్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌కు రైతులు తమ భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దని ఇటీవల కాలంలో విన్నవించుకున్నారు. పనుల టెండర్లు దక్కించుకున్న కన్‌స్ట్రక్షన్ జనరల్ మేనేజర్ సాల్మన్‌రాజ్ మరో మూడురోజుల వరకు పనులు నిలుపుదల చేస్తున్నామని, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్డర్‌ను ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

ముగిసిన 'వాయిస్ ఫర్ గర్ల్స్'

కేసముద్రం, ఫిబ్రవరి 2 : కేసముద్రం స్టేషన్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న 'వాయిస్ ఫర్ గర్ల్స్' కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్య ప్రాముఖ్యత, భవిష్యత్తులో విద్యార్థుల లక్ష్యాలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ స్వప్న తెలిపారు.

ముదిరాజులను బీసీఏలో చేర్చాలి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి2 : కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ విజ్ఞప్తి చూశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. 2022లో బీసీ కమిషన్ సుప్రీం కోర్టులో అఫిడవిట్ వేయడంతో తుదితీర్పు వచ్చిందని, దీంతో ముదిరాజులను బీసీ-ఏలోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

అమరుల ఆశయసాధనకు ఉద్యమించాలి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 2 : యువత అమరుల త్యాగాలను పుణికిపుచ్చుకుని సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.విజయసారథి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో శుక్రవారం ఏఐవైఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జలగం ప్రవీణ్, అంబోతు అశోక్, మహేందర్, నాగేంద్రబాబు, చింతకుంట్ల వెంకన్న, రమేష్, రవి, బిచ్చు, శేఖర్ పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

కేసముద్రం, ఫిబ్రవరి 2 : విద్యార్థి జీవితంలో పదో తరగతిలో కీలకమైన దశఅని, ఇందులో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సూచించారు. ఉప్పరపల్లి, కేసముద్రం విలేజి ఉన్నత, మహమూద్ పట్నం కేజీబీవీ పాఠశాలల్లో శుక్రవారం డీఈవో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఆత్మవిశ్వాసంతో ఉండాలని అన్నారు. చదివిన ప్రతీ అంశాన్ని గుర్తుపెట్టుకొని జవాబులు రాయాలని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడానికి కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ హెచ్ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి, హెచ్ఎం విజయసుశీల, ఉపాధ్యాయులు ఉన్నారు.

5న విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 : జిల్లా కేంద్రంలో ఈనెల 7న జిల్లాస్థాయి డ్రాయింగ్, పాటలు, పద్యాలు, ఉపన్యాస పోటీలు ఉంటాయని డీఈవో రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని యాజమాన్య పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈనెల 5వ తేదీలోగా పోటీలో పాల్గొనే విద్యార్థుల వివరాలు గూగుల్ ఫాంలో పూర్తి చేసి నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక్కో అంశానికి ఒక్క విద్యార్థి మాత్రమే పాల్గొనాలని సూచించారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావు సెల్ నెంబర్ : 98495 98281ను సంప్రదించాలన్నారు.

ఆరు గ్యారెంటీలను తక్షణం అమలు చేయాలి

మరిపెడ, ఫిబ్రవరి2 : సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీ పథకాలను తక్షణం అమలు చేయాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మరిపెడ మండల సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనం ఎంపీపీ గుగులోత్ అరుణరాంబాబు అధ్యక్షతన జరుగగా రెడ్యానాయక్ పాల్గొని మండలంలోని 44 మంది సర్పంచ్‌లను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, ఎంపీపీ అరుణ రాంబాబు, జడ్పీటీసీ శారదారవీందర్, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, తాళ్లపెల్లి శ్రీనివాస్, సీహెచ్ ప్రభాకర్, కాలునాయక్, శ్రీనివాస్‌రావు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వులను అందించాలి : వీఆర్ఏలు

పెద్దవంగర, ఫిబ్రవరి 2 : రాష్ట్రంలో 61 ఏళ్లు నిండిన వీఆర్ఏల వారసులకు నియామకపు ఉత్తర్వులను అందించాలని వీఆర్ఏలు డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ వీరగంటి మహేందర్‌కు వీఆర్ఏలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు నీరటి యాకయ్య మాట్లాడారు. యాకుబ్ పాషా, వీఆర్ఏలు చెరుకు వెంకటయ్య, వెంకటనారాయణ, ఎల్లయ్య, ఆంజయ్య ఉన్నారు.

పుస్తక సమీక్ష పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులు

మరిపెడ, ఫిబ్రవరి 2 : జాతీయస్థాయి పుస్తక సమీక్ష పోటీల్లో మరిపెడ మోడల్ స్కూల్ విద్యార్థినులు లక్ష్మీనందిని, నందిగామ స్వరూప ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం పురిమళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత రెండ్రోజులుగా ఈ పోటీలను నిర్వహించారని, దీంట్లో లక్ష్మీనందిని, స్వరూప విజేతలుగా నిలిచారన్నారు.

1.630 కిలోల ఎండుగంజాయి పట్టివేత

- ఇద్దరిపై కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు
- టౌన్ ఇన్‌చార్జి సీఐ రమేష్ వెల్లడి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 2 : జిల్లా కేంద్రం శివారులో ప్రభుత్వ నిషేధిత 1.630 కిలోల (కిలో 630 గ్రాములు) ఎండు గంజాయిని పట్టుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మానుకోట టౌన్ ఇన్‌చార్జి సీఐ రమేష్ శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నివాసముంటున్న ఇస్లావత్ సాయిగణేష్, పట్టణంలోని వేంకటేశ్వర బజారుకు చెందిన మేక లోకేష్ చదువును మధ్యలో ఆపేసి.. మద్యం, గంజాయికి బానిసయ్యాడు.ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చింతూరు నుంచి ఎండు గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి నెంబర్ ప్లేట్‌లేని స్కూటీ (ద్విచక్రవాహనం)పై మహబూబాబాద్‌లో విక్రయించేందుకు తీసుకువస్తున్నారు. జిల్లా కేంద్రం శివారు ఆర్తిగార్డెన్ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, నెంబర్‌ప్లేట్ లేని స్కూటీని ఆపారు. ఈ తనిఖీలో స్కూటీ డిక్కీలో ఉన్న 1.630 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్ పట్టుబడినట్లు తెలిపారు. స్కూటీపై వచ్చిన ఇరువురిని అదుపులోకి తీసుకుని గంజాయితో పాటు తరలింపుకు ఉపయోగించిన వాహనంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన 1.630 కిలోల ఎండుగంజాయి విలువ సుమారు రూ.37,500 ఉంటుందని తెలిపారు. గంజాయితో పట్టుబడిన ఇస్లావత్ సాయిగణేష్, మేక లోకేష్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు రామారావు, పవన్, కానిస్టేబుళ్లు సుధీర్, రాజు, సురేందర్, శ్రీకాంత్ ఉన్నారు.

15 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు, ఫిబ్రవరి 2 : మండలంలోని జామతండా శివారు నిమ్మతండాలో ఓ ఇంట్లో నిల్వఉన్న 15 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని పోలీస్‌లు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం. నిమ్మతండాకు చెందిన గుగులోత్ శంకర్ తనఇంట్లో 15 క్వింటాళ్ల నల్లబెల్లం, రెండు క్వింటాళ్ల పటిక నిల్వ చేశాడని పోలీస్‌లకు సమాచారం అందించడంతో బెల్లం, పటికను సీజ్ చేశారు. బెల్లం వ్యాపారి శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

విద్యార్థిపై పాక్సో కేసు నమోదు

నెల్లికుదురు, ఫిబ్రవరి 2 : మండలంలోని ఓ విద్యార్థిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. మండలంలోని ఓ విద్యార్థినికి (మైనర్) ఆలేరు గ్రామానికి చెందిన ఓ విద్యార్థి (మైనర్) మెసేజ్‌లు పంపాడు. దీంతో ఆ విద్యార్థిని మనస్థాపం చెంది, గతనెల 28వ తేదీన పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు వెంటనే మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. అసభ్యకర మెసేజ్‌లు పెట్టి, విద్యార్థిని పురుగులమందు తాగడానికి కారకుమైన విద్యార్థిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ఆటోట్రాలీ, బైక్ ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

గూడూరు, ఫిబ్రవరి 2 : మండలంలోని అయోధ్యపురం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం. పూజారి సదయ్య కులవృత్తిలో భాగంగా తాటిచెట్లు ఎక్కుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అయోధ్యపురం నుంచి గాజులగట్టు శివారు ఇప్పల్‌తండాలో తాటిచెట్లు ఎక్కేందుకు ద్విచక్ర వాహహనంపై వెళ్తున్నాడు. నెక్కొండ వైపు నుంచి వస్తున్న ట్రాలీఆటో సదయ్య వెళ్తున్న ద్విచక్రవాహన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సదయ్యకు ఎడమకాలు విరగగా.. తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 ద్వారా గూడూరు సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఏజెన్సీలో బాంబ్‌స్క్వాడ్ బృందం తనిఖీ


రోడ్డు వెంట తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్ అధికారులు

మహబూబాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ, గంగారం మండలాల్లో బాంబ్‌స్క్వాడ్ అధికారులు శుక్రవారం తనిఖీలతో జల్లెడ పడుతున్నారు. ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీపాటిల్ ఆదేశాల మేరకు ఆర్ఐ అడ్మిన్ అనిల్ ఆధ్వర్యంలోవిస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన కొత్తగూడ, గంగారం మండలాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంఘ విద్రోహచర్యలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా మహబూబాబాద్ బాంబ్‌స్క్వాడ్ బృందం రోడ్ ఓపెనింగ్ పార్టీ యాంటి సబటేజ్ చెక్‌లో కల్వర్టులు, బ్రిడ్జిలు, అనుమానిత వ్యక్తులను, అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేపట్టినట్లు చెప్పారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- రూరల్ ఎస్సై దీపికారెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రూరల్ ఎస్సై దీపికారెడ్డి అన్నారు. మానుకోట మునిసిపల్ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్సై రమేష్, బ్లూకోట్స్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలను అందించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 2 : జిల్లాలో వీవోఏలుగా విధులు నిర్వహిస్తున్న వారందరికి సకాలంలో వేతనాలు అందించి, ఆదుకోవాలని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నీలం కృష్ణవేణి, చింత మౌనికలు కోరారు. ఈ మేరకు డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ సన్యాసయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, అనిత, లకుపతి, రమేష్, నారాయణసింగ్, వెంకటేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎనలేనిది


సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు

తొర్రూరు, ఫిబ్రవరి 2 : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమైందని, వారితో పాటు వార్డుసభ్యులు, ఎంపీటీసీల సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని ఎంపీపీ టీసీ అంజయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్పంచ్‌ల ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో వారు మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారుల సహకారంతో అభివృద్ధి జరిగిందన్నారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయని, ఉత్తమ గ్రామ పంచాయతీలుగా అవార్డులు దక్కించుకున్నాయన్నారు. అనంతరం సర్పంచ్‌లను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో కుమార్, తహసీల్దార్ వినోద్‌కుమార్, ఎంపీవో గౌస్, డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్య, కో ఆప్షన్ అంకుష్, ఆయా శాఖల అధికారులు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రాంవిలాస్ గల్లీరోడ్ల విస్తరణకు సహకరించాలి

- అడిషనల్ కలెక్టర్ లెనిన్‌వత్సల్ టోప్పో

మరిపెడ, ఫిబ్రవరి 2 : మరిపెడ మునిసిపల్‌లోని రాంవిలాస్ గల్లీలోని రోడ్ల విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్‌వత్సల్ టోప్పో సూచించారు. శుక్రవారం ఆయన రాంవిలాస్ గల్లీ విస్తరణ పనులను ఆయన పరిశీలించి, అక్కడి ప్రజలతో మాట్లాడారు. రోడ్ల విస్తరణకు అందరు సానుకూలంగా స్పందించి, ఇప్పుడు పేచీలు పెట్టడం సరికాదని సూచించారు. రోడ్ల విస్తరణతో ఈ గల్లీ ఎంతో ఆధునీకరణ అవుతుందని గుర్తు చేశారు. పట్టణంలోని గ్రీన్‌పార్కు, ఆడిటోరియం సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మునిసిపల్ కమిషనర్ రాజు, 7వ వార్డు కౌన్సిలర్ వూరుకొండ శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

తొర్రూరు, ఫిబ్రవరి 2 : పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు సమాజంలో సగానికిపైగా ఉన్న బీసీ జనాభాకు సముచిత స్థానం కల్పించాలని బీసీ ఉద్యమాల రూపకర్త డాక్టర్ పి.అశోక్, సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి అన్నారు. శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో బీసీ మేనిఫెస్టో పుస్తకావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రభుత్వం బీసీలను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, రఘుపతి, వీరన్న, ఆమని, సుశీల, ప్రవీణ్ పాల్గొన్నారు.

బాధితులకు జడ్పీటీసీ సాయం

కొత్తగూడ, ఫిబ్రవరి 2 : మండలంలోని కిష్టాపురంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయి నిరాశ్రయులుగా మిగిలిన బంగారి సమ్మయ్య కుటుంబానికి శుక్రవారం జడ్పీటీసీ సభ్యురాలు పుల్సం పుష్పలత శ్రీనివాస్ ఇంటి నిర్మాణంకు రూ. 10 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, ఎంపీటీసీ భూక్య పుష్పలత నరేందర్ తదితరులు ఉన్నారు.

బయ్యారం సొసైటీ అక్రమాలపై.. కలెక్టర్, డీసీవోకు డైరెక్టర్ల ఫిర్యాదు

బయ్యారం, ఫిబ్రవరి 2 : బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) సొసైటీలో జరిగిన అక్రమాలపై శుక్రవారం పలువురు డైరెక్టర్లు కలెక్టర్, డీసీవోలకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం రైతులకు మంజూరు చేసిన రుణాలను పంపిణీ చేయకుండా సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి తన స్వంతానికి వాడుకొని పాలకవర్గాన్ని బదనాం చేసే విధంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల డీసీవో కార్యాలయం నుంచి పాలకవర్గానికి నోటీసులు వస్తే ఈ విషయం బయటపడుతుందోనని నోటీసులను దాచిపెట్టి కుట్రకు పాల్పడినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. సొసైటీ పరిధిలో పలురకాలకు సంబంధించి దాదాపు రూ. 60 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు డైరెక్టర్లు బండారి మల్లయ్య, కసనబోయిన శ్రీనివాస్, గాడుదుల కేతమల్లు, నద్దునూరి యశోద, తెల్లం బిక్షం, గంగుల సత్యనారాయణ సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజాసేవను కొనసాగించాలి

కురవి, ఫిబ్రవరి 2 : సర్పంచులుగా పదవీకాలం ముగించుకున్న వారు నిరంతరం ప్రజాసేవను కొనసాగించాలని జడ్పీ సీఈవో రమాదేవి అన్నారు. మండల సర్పంచుల ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో శుక్రవారం ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. పదవికే విరమణ తప్పితే ప్రజాసేవకు విరమణ ఉండదన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో ఎన్నో ఒడిదుడుకులు అధిగమించి గ్రామాలను అభివృద్ధిలో నిలిపారని సర్పంచుల సేవలను కొనియాడారు. ఎంపీడీవో సరస్వతి, తహసీల్దార్ సునీల్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపిచ్చిరెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, ఎంపీవో రఘుపతిరెడ్డి, ఏపీవో యాకాంబ్రం, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కురవి, ఫిబ్రవరి 2 : గుండ్రాతిమడుగు జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి, పాఠశాలను నడిపి ఆకట్టుకున్నారు. డీఈవోగా గండమల్ల వర్షిత, ఎంఈవోగా బాదావత్ శిల్ప, హెచ్ఎంగా నవ్యలు వ్యవహరించి స్వయం పరిపాలన దినోత్సవాన్ని నడిపించారు. ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు హెచ్ఎం జానయ్య బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు యాదగిరి, స్వర్ణ, సురేష్, మహేష్, రమ, బిక్షపతి, లక్ష్మా, విజయ్‌చందర్ పాల్గొన్నారు.

ముల్కలపల్లి సర్పంచ్‌కు ఘన సన్మానం

డోర్నకల్, ఫిబ్రవరి 2 : ముల్కలపల్లి సర్పంచ్ జవ్వాజీ రాంప్రసాద్‌ను గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. ఈ సభకు ముల్కలపల్లి గ్రామ ప్రత్యేక అధికారి రుక్మాంగదరావు హాజరై మాట్లాడారు. రాంప్రసాద్ చిన్న వయస్సులోనే సర్పంచ్‌గా ఎన్నికై గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రత్యేక అధికారి లక్ష్మా, నంజాల మధుసూదన్, మల్లికార్జున్, పాండురంగయ్య, బిక్కానాయక్, బాప్‌చంద్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి

పెద్దవంగర, ఫిబ్రవరి 2 : ప్రత్యేకాధికారుల, ప్రజలందరి భాగస్వాయంతోనే గ్రామాలాభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీవో బి.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీవో సత్యనారాయణ, పీఆర్ఏఈ దయాకర్, మిషన్ భగీరథ ఏఈ యాకుబ్ పాషా, ఇరిగేషన్ ఏఈలు స్వాతి, లక్ష్మీ, హెచ్ఎంలు శ్రీనివాస్, విజయ్ కుమార్, కళాధర్, శేషవల్లి పాల్గొన్నారు.